క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



చిలుకలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలుకలూరు గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు మంగళవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. వీఆర్వో పుల్లయ్య, బీఎల్ఓలతో కలిసి ఆయా గ్రామాల్లో డెమో ద్వారా ఓటు వేసే విధానంపై వివరించారు. ప్రతి ఎన్నికల్లో ఓటు వేసే సమయంలో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని.. అలాంటివి లేకుండా ముందస్తుగానే ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవీంద్ర ప్రసాద్ తెలిపారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



కోటకొండలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ ప్రభుత్వ పాఠశాలలో ఎస్టీయూ నాయకులు మంగళవారం ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, ఎంఈఓ శ్రీలక్ష్మి, సర్పంచు వేంకటేశ్వర్లు చేతుల మీదుగా 2024వ సంవత్సరం నూతన డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా నాయకుడు టి.సుబ్బయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ సంఘం పాటు పడుతోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సావిత్రి, నాలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించండి



పాడిగేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

దొర్నిపాడు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి ధనుంజయుడు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రం దొర్నిపాడులో పాడిగేదెలు, ఎద్దులకు టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువుల కాళ్లు, నోట్లో పుండ్లు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్తగా ప్రభుత్వం పశువులకు ఉచితంగా టీకాలు వేస్తుందన్నారు.

5 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

నంద్యాల(అర్బన్): మండలంలో ఈనెల 5 నుంచి మే 7వ తేదీ వరకు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ పాండురంగాపురం, 12న చాబోలు, 19న అయ్యలూరు-1, ఫిబ్రవరి 2న పులిమద్ది, 9న కానాల-1, 13న కొత్తపల్లె-1, 20న రాయమాల్పురం, 27న కొత్తపల్లె-2 పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మార్చి 5న పోలూరు, 12న కానాల-2, 22న అయ్యలూరు-2, 30న భీమవరం, ఏప్రిల్ 6న బిల్లలాపురం, 16న మిట్నాల, 23న పెద్దకొట్టాల, 30న పుసులూరు, మే 7న పొన్నాపురం-1 గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుకాణంలో చోరీ

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక సూరజ్ గ్రాండ్ సమీపంలో ఉన్న సిగరెట్ల దుకాణంలో రూ.1.4 లక్షలు విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లను గుర్తుతెలియని దొంగలు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానిక సలీం నగర్‌కు చెందిన బాధితుడు జాకీర్ ఉస్సేన్ తెలిపిన వివరాల మేరకు గత కొంత కాలంగా సూరజ్ గ్రాండ్ సమీపంలోని ఓ దుకాణంలో సిగరెట్ల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి యథావిధిగా దుకాణం మూసి వెళ్లిపోయాడు. మంగళ వారం ఉదయం దుకాణం తెరవడానికి రాగా అప్పటికే షాపు తాళాలు పగలగొట్టబడ్డాయి, షెట్టర్ ఎత్తి చూడగా దుకాణంలోని సిగరెట్ ప్యాకెట్లు కనిపించలేదు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు క్లూస్ టీంను పిలిపించి దొంగల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

జూనియర్ అధ్యాపకులకు అవార్డులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీ జూనియర్ అధ్యాపకులు లోని ఎనిమిది మందికి స్వాత్రిబాయి సేవా పురస్కార్ బెస్ట్ అవార్డులు ఇవ్వనున్నట్లు బాబాసాహెబ్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొమ్మపాలెం శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 3వ తేదీన సావిత్రిబాయి పూలే 192వ జన్మదినాన్ని పురస్కరించుకొని అవార్డులు అందజేస్తామని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈఓ సునిత హాజరవుతారన్నారు.

వణికిస్తున్న చలి

- తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సాంబవరం వద్ద జొన్న పైరుపై కమ్ముకున్న మంచు దుప్పటి



జిల్లెల్లలో చలిమంట వేసుకున్న యువకులు



చాబోలు సమీపంలో ఉదయం 7:30 గంటలైనా ధాన్యం రాసులపై కురుస్తున్న మంచు

గోస్పాడు: గత పదిహేను రోజుల నుంచి చలి పులి ప్రజలను వణికిస్తోంది. సాయంత్రం 6 గంటలకే వాతావరణం పూర్తిగా చల్లబడిపోతుంది. ఇక ఉదయం ఎనిమిది గంటలైనా మంచు వదలడం లేదు. ఇక పల్లెలు, పంట పొలాలను మంచు దుప్పటి కమ్మేస్తుంది. నంద్యాల పట్టణ సమీపంలోని హైవేపై ఉదయం ఏడున్నర గంటలు దాటినా వాహనాలు లైట్లు వేసుకొని వెళ్తున్నాయి. అలాగే పగటి పూట కొంతమేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో కొంత వేడిగా ఉంటున్నా చలి ప్రభావం రోజంతా కొనసాగుతోంది. అయితే ఈ వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు, చర్మ సంబంధ, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వారు చలి సమయంలో బయటకు రాకపోవడమే మంచిదంటున్నారు. ఇక ప్రయాణాలు చేసే వారు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, మాస్క్‌లు తప్పనిసరిగా ధరించాలని చెబుతున్నారు.ధాన్యం రాసుల వద్ద, పొలాలకు కాపలా ఉండే వారు చలిని తట్టుకునేందుకు, పల్లెల్లో చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. కాగా చలి కారణంగా ధాన్యం ఆరబోసుకున్న వారికి ఇక్కట్లు తప్పడంలేదు. ఉదయం పదకొండు గంటలకు ఎండ తీవ్రత మొదలవుతుండటం, సాయంత్రం ఐదింటికి మళ్లీ చలిగాలులు ప్రారంభమవుతుండటంతో ధాన్యం సరిగా ఎండిపోవడం లేదని, రోజుల తరబడి కళ్లాల్లో ఉంటున్నామని చెబుతున్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు ..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
డిసెంబర్ 27	29	19
28	31	20
29	32	19
30	31	17
31	31	19
జనవరి 1	32	19

చలి నుంచి రక్షించుకోండి ఇలా...

- సబ్బుతో కాకుండా సున్నిపిండితో స్నానం చేయాలి.
- శరీరం పొడిబారకుండా పెట్రోలియం జల్లీ, వాజలిన్ లాంటివి రాసుకోవాలి.
- రాత్రి వేళల్లో ప్రయాణం చేసే వారు ఉన్ని దుస్తులు ధరించాలి.
- చిన్నారులు, వృద్ధులు చర్మం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి.
- ఈ కాలంలో తగిన మోతాదులో తప్పనిసరిగా నీళ్లు తాగాలి.
- ఐస్ క్రీంలు, చల్లని నీరు, చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి.
- దుమ్ము, ధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా, చలి గాలుల్లో తిరగరాదు.

సీజనల్‌వ్యాధులపై అప్రమత్తత అవసరం..

- పొగ తాగరాదు, పొగ నిండిన గదుల్లో ఉండరాదు.
- అనవసర శారీరక శ్రమ చేయరాదు.
- చలి, తేమను తప్పించుకొని వీలైనంత వరకు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి.
- ధ్యానం, యోగా సాధన ద్వారా ఆస్తమాను అదుపులో పెట్టుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి



శీతాకాలంలో జాగ్రత్తగా ఉంటూ శరీరాన్ని రక్షించు కోవాలి. ఈ కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే విటమిన్-సీ కలిగిన పదార్థాలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలి. ముఖ్యంగా గతంలో కోవిడ్ బారినపడిన వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. చిన్నపిల్లలు, వృద్ధులు చలి నుంచి రక్షణనిచ్చే దుస్తులు ధరించాలి. ముఖ్యంగా ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండాలి.

– గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

సామాజిక సేవలు విస్తరించాలి

నంద్యాల(అర్బన్): వరల్డ్ విజన్ ఇండియా ఆధ్వర్యంలో సామాజిక సేవలను విస్తరింపజేయాలని టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక మధుమణి కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం వరల్డ్ విజన్ ఇండియా ఆధ్వర్యంలో నంద్యాల మండలం అయ్యలూరు, చాపిరేవుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 150మంది విద్యార్థులకు స్టీల్ గిఫ్ట్స్' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ విజన్ సంస్థ నాలుగేళ్లుగా గ్రామాల్లోని విద్యార్థుల్లో బహుమతులు, పుస్తకాల పంపిణీ ద్వారా సాయం అందిస్తోందన్నారు. వరల్డ్ విజన్ సంస్థ పీఓ తిరుపతిరావు మాట్లాడుతూ నంద్యాల మండలంలోని 15 గ్రామాల్లో వరల్డ్ విజన్ సేవలను విస్తరించామని, మిగిలిన అన్ని గ్రామాల్లోని విద్యార్థులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మదర్ సొసైటీ అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల పత్రాల స్వీకరణ ప్రారంభం

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల జీవన ప్రమాణ పత్రాల స్వీకరణ ప్రారంభమైనట్లు జిల్లా ఖజానా, గణాంక శాఖ అధికారిణి లక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పెన్షన్ కొనసాగింపు కోసం జీవన ప్రమాణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించాల్సి ఉంటుందని, పెన్షన్ దారులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణకు అవకాశం కల్పించిందన్నారు. సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29వ తేదీలోగా సమర్పించాలన్నారు. నివాసిత ప్రాంతంలో ఉన్న మీసేవ, నెట్ సెంటర్, ఉప ఖజానా కార్యాలయాల్లో సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. సకాలంలో సమర్పించని వారి పెన్షన్ మార్చి నుండి నిలిపి వేయబడుతుందని చెప్పారు.

పింఛన్ల పంపిణీ వారోత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): మండలంలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే పింఛన్ల పంపిణీ వారోత్సవాలు విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సుగుణశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల మండలానికి 189 కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయని, త్వరలో మండల కేంద్రం నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పారవి, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3వేలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని వివరించాలన్నారు. అదేవిధంగా ఆడుదాం ఆంధ్ర గ్రామస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు టీషర్టు, టోపీలను ఇవ్వనున్నామన్నారు. మండల స్థాయిలో ఈనెల 9 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు జరుగుతాయని, క్రీడాకారులు సిద్ధంగా ఉండాలన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



తుడుమలదిన్నెలో డ్రోన్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : వ్యవసాయం రంగంలో ఆధునిక పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని తుడుమలదిన్నె, మాయలూరు గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. ముందుగా డ్రోన్ పరికరంతో శనగ పంటపై క్రిమి సంహారక మందు పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు సతీష్‌కుమార్, సురేష్‌బాబు, గ్రామ సర్పంచ్ జనపాల సాయిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: సచివాలయాల సిబ్బంది సమయపాలన తప్పని సరిగా పాటించాలని ఎంపీడీఓ అనసూయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని తెలిపారు. ప్రతి రోజు సచివాలయాల పరిధిలో సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన ప్రజలకు పథకాలు లబ్ధి చేకూరేలా చూడాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న సర్పంచ్ మౌనిక

నంద్యాల(అర్బన్): ప్రజల భాగస్వామ్యం ద్వారానే గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామని చాబోలు గ్రామ సర్పంచ్ మౌనిక అన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి నరేంద్ర అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఏడాది ప్రణాళికలో భాగంగా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలనే విషయంపై గ్రామ సభ నిర్వహించామన్నారు. ఈనెల 27, 29 తేదీల్లో మరోమారు గ్రామ సభ నిర్వహించి ఎంపిక చేసిన పనులకు ఆమోదం తెలపనున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హుసేన్‌బాషా, ఎంపీటీసీ దావీద్, కో ఆప్షన్ మెంబరు పాలబాషా, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషాల వెల్లువ

- ప్రభుత్వం మంచి చేస్తున్నందునే ధైర్యంగా మీ ముందుకు వస్తున్నాం
- ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తుందని, దీంతో గడప గడపలో సంతోషాలు వెల్లువిరుస్తున్నాయని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డు సాదిక్ నగర్‌లో ఉదయం, సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ జలీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వార్డులో రూ.82లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ఎమ్మెల్యే శిల్పారవి ప్రారంభించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు ఎంత మేర సంతృప్తి చెందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. మరోమారు ఇలాంటి సంక్షేమాభివృద్ధిని అందించాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ మంచి చేస్తున్నందునే ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నామన్నారు. అర్హులకు వారి ఇళ్ల వద్దకే లబ్ధి చేకూర్చి ఎవరి మధ్య వర్తిత్వం లేకుండా ఎలాంటి సిఫారసులు లేకుండా పథకాలు అర్హులందరికీ అందజేస్తున్నామన్నారు. మరీ ముఖ్యంగా వైద్య ఆరోగ్యం విభాగాలలో సంస్కరణలు చేసి పేదలందరికీ భరోసా కల్పిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ పరిపాలన చేస్తుంటే ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే హామీలు ఇస్తూ టీడీపీ నాయకులు తెరపైకి వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ 99శాతం పైగా అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టిశ్రీధర్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్ బాషా, హుస్సేన్ వలి, జలీల్‌బాష, షఫీ, ఇక్బాల్, చిరు, మౌలాలి, వలి, ఇతర వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు.

బకాయిలను చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడులు కోరారు. మంగళవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో మధుసూదనరావు, పుల్లయ్య, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణుడు, వెంకటరామిరెడ్డి, విజయరమేష్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన నాగ ప్రసాద్(40)అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కొన్నేళ్లుగా స్వగ్రామంలో హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించే మృతుడికి అప్పుడప్పుడు కడుపు నొప్పి వచ్చేది. డాక్టర్లకు చూపించుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి భార్య సుమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోలుకోలేక యువతి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని బత్తలూరు గ్రామానికి చెందిన సుప్రియ (22) అనే యువతి కోలుకోలేక మంగళవారం మృతి చెందారు. ఈమె గత నెల 25న కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. మృతురాలి తల్లి సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

శ్రీశైలం చేరిన అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలకు ఆహ్వానం పలుకుతున్న భక్తులు



శ్రీశైలానికి చేరిన అయోధ్య రామ అక్షింతలు

శ్రీశైలం: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న గడప గడపకు అయోధ్య అక్షింతలు చేరవేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్షింతలు శ్రీశైలానికి చేరాయి. వాటికి స్థానిక గంగాధర మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి మండల వ్యాప్తంగా అందరి ఇళ్లకు శ్రీరాముని అక్షింతలు అందించే కార్యక్రమం ప్రారంభిస్తామని స్థానిక శ్రీరామ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న అయోధ్య ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ముందుగానే ప్రతిష్ఠించిన బాలరాముని విగ్రహానికి పూజలు చేసి, ఆ అక్షింతలన్నింటినీ దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



కోటకొండలో రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



అల్లూరులో రాజేశ్వరమ్మకు కళ్ల జోడు పెడుతున్న ఎంపీపీ



చెన్నూరులో బీపీ పరీక్షిస్తున్న డాక్టర్

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొదటి విడత సురక్ష కార్యక్రమంలో కంటి జబ్బులు చికిత్సలు చేయించుకున్న 60 మందికి కంటి అద్దాలు అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. వైద్య శిబిరంలో స్త్రీ వైద్య నిపుణురాలు మేఘన 200 మంది మహిళలకు, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి 180 మంది చిన్నారులకు వివిధ జబ్బులకు చికిత్సలు చేశారు. వైద్యులు రాబర్ట్ కెనడీ, వెంకటసుబ్బయ్య 126 మందికి షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, కంటి వైద్య నిపుణులు రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామక్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌రహీమ్ పాల్గొన్నారు.

508 మందికి వైద్య పరీక్షలు

శిరివెళ్ల: చెన్నూరు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, క్రాంతి కిరణ్ 508 మందికి కంటి, జనరల్, ఆర్థోపెడిక్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు చిట్టిబాబు, ఎంపీటీసీ సులోచన, మాజీ సర్పంచు మేర్వ నాగభూషణంరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓ ఆర్డీ నాగేంద్ర, గాజులపల్లె పీహెచ్ డాక్టర్లు వెంకటరెడ్డి, దినేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని కోటకొండ గ్రామ సర్పంచు దేగాని వెంకటేష్ అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండల పరిధిలోని కోటకొండలో మంగళవారం ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి షాహీనూర్ వైద్యులతో కలిసి ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 432 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం వైద్యంపై ఇంత దృష్టి సారించలేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పల్లె ప్రజల ముంగిట్లోకే వైద్యాన్ని తీసుకొచ్చిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, వైద్యులు నవీన్‌కుమార్, ప్రశాంత్, శివాణి, వలంటీర్లు, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన కందుకూరి ఉశేనిబీ (41) అనే వివాహిత విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఇంటిపై నిర్మిస్తున్న గోడలకు నీరు చల్లుతుండంగా విద్యుత్ తీగ తగిలి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల వైద్య శాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. ఈమేరకు మృతురాలి భర్త ఉశేని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఏపీ బర్ధన్‌కు నివాళి

నంద్యాల(న్యూటౌన్): శ్రమజీవుల కోసం నిరంతరంగా పోరాటాలు సాగించిన యోధుడు ఏపీ బర్ధన్‌కు మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, నాయకులు ధనుంజయుడు, సోమన్న బర్ధన్ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సురేష్, మద్దిలేటి, నాగేశ్వరరావు, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ..

రుద్రవరం: రుద్రవరం-అప్పనపల్లెదారిలో మోటర్ సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దకంబలూరు గ్రామానికి చెందిన రత్నమయ్య మంగళవారం రుద్రవరానికి వెళ్లి తిరిగి వస్తుండగా వాసాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అటుగా వెళ్తున్నవారు గమనించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.